# 18. కుంటి సలహాలు

అమెరికాలో ఈమధ్య హత్యలు మరీ ఎక్కువయిపోయాయట. అసలేఅది వియత్నాంలాంటి దేశాల్లో హత్యల్ని అమోఘంగా ప్రాక్టీస్ చేసిన దేశం కదండీ! అక్కడ ఛాన్సులు తగ్గాక మరెక్కడన్నా మొదలెట్టకపోతే బాలన్స్ కుదరటం ఎలా?

అయితే ఈ హత్యలీ మధ్య మరీ తలనొప్పిగా తయారయ్యాయి. రాత్రిళ్ళు చీకటిగొందుల్లో ఖూనీల సంగతి అలా ఉంచి పట్టపగలు ఊరి శివార్లలో పోయే ప్రయాణీకుల్ని వాళ్ళ వాహనాల్తో సహా నిలేసి నిలువుదోపిడీ చేస్తున్నార్ట. ఖర్మగాలి అలా నిలవేయబడ్డవారిలో ఎవరి జేబుగానీ, పర్సుగానీ ఖాళీగా ఉంటే వళ్లు మండుకొచ్చి వాళ్లని నిలువునా ఓ పిస్తోల్ దెబ్బతో చంపేస్తున్నార్ట.

అందుకని ఓ అమెరికన్ నగర కౌన్సిల్ తన పౌరులకు ఈ హత్యల్నించి తప్పించుకునేందుకు అమోఘమైన సలహా ఒకటి ఇచ్చింది.

"పౌరులారా! అత్యంత సాధుశీలురైన మన జేబుదొంగలు మిమ్మల్నెందుకు కాల్చి పారేస్తున్నారు?... కేవలం

మీ జేబులూ, పర్సులూ ఖాళీగా ఉండబట్టేగదా! తత్ఫలితంగా తమ శ్రమ వృధా అయిందని సదరు సర్వోదయవాది పిక్ పాకెట్లు ఆవేశపడబట్టేగదా! వారి శ్రమవృధా కాకుండా ఉంటే వారెలాగూ మిమ్మల్ని కాల్చనవసరం ఉండదుగదా?

"కనుక : ఓ మహాఘనత వహించిన అమెరికన్ పౌరులారా? మీరు అలాంటి పిస్తోల్ వీరుల బారినపడే సమయానికి మీ పర్సులో కనీసం ఓ ఇరవై డాలర్లన్నా ఉండేలా జాగ్రత్త పడండి. అలా అయితే మీకు ప్రాణభయం ఉండదుగాక ఉండదు."

అని ఆ నగరపాలక పెద్దలు తమ పాలిత పిన్నలకు ఓ ఉచిత సలహా పారేశారు. అద్భుతంగా ఉందిగదండి సలహా! ఆ సలహా మొదట ఏ మహాత్ముని బుర్రలో పుట్టిందోగానీ, సదరు మహాత్ముడు పూర్వ జన్మలో మన ఫైనాన్స్‌మినిస్టరో అతని శిష్యుడో అయివుండాలి. అంత గొప్ప అయిడియాలు మన పుణ్యభూమికి ఆర్థిక మంత్రిగా ఉండే పుణ్యాత్ములకు తప్ప మరెవరికన్నా వస్తాయంటే నమ్మటం కష్టమే మరి.

మన ఆర్థికమంత్రుల బుర్రలు ఆ పీట ఎక్కి కిరీటం పెట్టించుకోగానే అమోఘంగా ఆలోచించ నారంభిస్తాయి. మూడేళ్ళ క్రితం అరవై పైసలున్న సిగరెట్ పాకెట్టును ఈనాడు తెల్లారేసరికి రూపాయిపెట్టి చచ్చినట్టు కొనేలా

కొన్ని కోట్లమంది చెవిమెలేయగల సత్తా సదరు పెద్దమనిషి చూపిస్తాడు.

“అదేమిటి మహానుభావా !” అంటే గాంధీగారి అమ్మమ్మలా మందహాసం చేయగలడు. “నేనేం మిమ్మల్ని కొనమని బలవతం చేస్తున్నానా ? ఇష్టమైతేనే కొనుక్కోండి. ఆ మాటకొస్తే నేనసలు మీ చేత ధూమపానం మాన్పిద్దామనే సిగరెట్లమీద పన్నులు పెంచేశాను. మీ ఆరోగ్యం అంటే నాకెంతో ప్రేమ. ధూమపానం మంచిదిగాదు. చూడండి : గాంధీగారు సిగరెట్లు తాగేవారా ? మీ మహాకవిసామ్రాట్టు విశ్వనాథ సత్యనారాయణ కూడా సిగరెట్లు తాగడటకదా !” అని ఎదురు ప్రశ్న వేయగలడు.

‘టెర్లిన్ గుడ్డలమీద పన్ను లేసావేమిటయ్యా’ అంటే సదరు మంత్రిగారు గాంధీటోపీనోసారి సవరించుకుని కస్తూర్బాగాంధీలా చిరుమందహాసం చేయగలడు.

“చూడండి! నాకు నాలుగు పిండిమిల్లు లున్నాయి. నా కొడుకులికి రెండు బట్టల మిల్లులున్నాయి- నా చుట్టపక్కాలకు మరెన్నో బట్టల మిల్లుల్లో వాటాలున్నాయి. అయినా నేను టెర్లిన్లు తొడగడం లేదే. ముతక ఖద్దరు గుడ్డలేమోస్తున్నానే? నా నెత్తిన రెండున్నర కిలోల బరువు ముతక ఖద్దరు టోపీని చచ్చినట్లు భరిస్తున్నానే! మరి మీకు టెర్లిన్లమీద మోజేమిటి? అది లగ్జరీ! అందుకే పన్ను లేశాను” అనగలడు.

అవును మరి. ఈనాడు నాకు ఓ షర్టుకి అయ్యే ఖర్చుతో నా చిన్నప్పుడు పదిషర్టులొచ్చేవి. ఆ లెక్కన ఇవన్నీ లగ్జరీలే. కానీ, ముతక ఖద్దరు మరింత లగ్జరీ గదా! దాన్ని మాత్రం ఎలా భరించటం? అదీగాక మన ఖర్మకొద్దీ ఖద్దరు కట్టిన వాడిని కొంతకాలంగా జనం అనుమానంగానూ, అయిదు ఖూనీలుచేసి, అరవై కొంపలు దోచుకున్న వాడిని చూసినట్టూ చూస్తున్నారే! చూస్తూ చూస్తూ వాటినెలా మొయ్యటం?

పైగా ఈ ఖద్దరు గుడ్డల్ని మొయ్యాలంటే వంట్లో కొంతన్నా ఓపికంటూ వుండాలి. ఈ ధరల పుణ్యమా అని మన జనాభాలో మెజారిటీకి ఆ మాత్రం ఓపికా లేదు గదా!

మన ఆర్థిక మంత్రుల లాజిక్ అద్భుతం. నోరులేని సామాన్యుడిని తమ లాజిక్‌తో అదరగొట్టి బెదరగొట్టి వాడి నోరు మూసి కడుపు మాడ్చటంలో వారు ప్రవీణులు. "పెట్రోలు మీద పన్ను వేశాంగానీ కిరసనాయిలు మీద వేయ లేదు గదరా సామాన్యుడా! నీకు కారులేదు గదా! పెట్రోలు ఏం చేసుకుంటావ్! పెట్రోలు నీ పొయ్యి ముట్టించుకునేం దుకు పనికి రాదు గదా!" అని పకడ్బందీగా అతగాణ్ణి ఓదార్చగలరు.

అయితే ఆ మర్నాడే పొరుగూరికి బయల్దేరిన సామా న్యుడిని బస్సువాడు అర్ధరూపాయి ఎక్స్‌ట్రా ఇమ్మంటాడు. అదేమిటంటే "పెట్రోల్ ధర పెరిగిందిరా నాయనా" అని

అడివి జంతువుని చూసిన నగర జంతువులా ఇకిలించగలడు. ఆ ఇకిలించిన వాడే ఆ సాయంత్రం పచారీ షాపుకుపోయి "షాపుకిలో బియ్యం పారెయ్యవయ్యా సుబ్బి సెట్టీ!'' అంటే సదరు సుబ్బిశెట్టిగారు "సరేగానీ, ఓ పావలా ఎక్స్ట్రా పడెయ్యవయ్యా! మీ లారీల వాళ్లు పెట్రోల్ ధర పెరిగిందని రేట్లు పెంచి కూర్చున్నారు! నాకేమో మోతకూలి పెరిగింది!" అంటాడు. ఏం చేస్తాడు మనవాడు?

ఇదంతా ఇలా ఎందుకు జరుగుతోందని కొందరు అమాయకులు ఆశ్చర్యపోతుంటారు. మనం డబ్బివ్వకపోతే గవర్నమెంటు మనకోసం మరిన్ని మంచిపనులు చేయటం ఎలాగా? అని కూడా కొందరు ధర్మాత్ములు అనుమానిస్తుంటారు.

వెనుక ఓ గూడెంలో ఓ గజ దొంగ పట్టుపడ్డాట్ట. వాడిని పోలీసుల కప్పగించి కోర్టుల చుట్టూ తిరిగే ఓపికలేని సదరుగూడెం గోచీ పాతరాయుళ్ళు వాడిని చితకదన్ని చివరికి అడిగారట.

"ఒరే! గజ దొంగేశ్వరరావూ! ఊళ్ళో అందరు భాగ్యవంతుల మేడలూ, మిద్దెలూ, గాదులూ ఉండగా మా గూడెంలో కాలెందుకు పెట్టావురా" అని.

అందుకు వాడు అన్నాడట. "ఎంతయినా వాళ్ళంతా నా దగ్గరి బంధువులూ, తప్పితే దూరపు బంధువులునూ,

చూస్తూ చూస్తూ మా కులం వాళ్ళ కొంపలే ఎలా దోచుకోను? అదీగాక వాళ్ళ దొడ్లలో పులుల్లాంటి కాపలా కుక్కలున్నాయి!" అని తన భక్తిని భీతిని ప్రదర్శించేడట.

మన సామాన్యుడికి ఇంకా ఈ కథ తెలిసి ఉండదు. తెలిసినా మనవాడు ఇంకా సామాన్యుడుగానే ఉండిపోడుగదా!

(ఏప్రిల్ 1973)